అందరికీ అన్నం పెట్టే అన్నదాతను కాంగ్రెస్ ప్రభుత్వం అరిగోస పెడుతున్నది. కష్టపడి పండించిన వడ్లను కొనుగోలు చేసేందుకు తాత్సారం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లను వారాలు గడిచినా కొనుగోలు చేయడం లేదు. వరి కోతల సీజన్ ముగుస్తున్నా సరిపడా కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. కేంద్రాల్లో వడ్లు పోసి వారాలు గడుస్తున్నా కాంటాలు కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సర్కారు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు బాగా తక్కువగా కొనుగోలు చేస్తుండడంతో మిల్లర్లు రైతుల వద్దకు వెళ్లి తక్కువ ధరకు వడ్లను కొనుగోలు చేస్తున్నారు. వడ్లకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320 ఉంటే మిల్లర్లు మాత్రం రూ. 2,200 కంటే ఎక్కువ చెల్లించడం లేదు. పెట్టుబడి ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రైతులు ఇప్పుడు వడ్ల ధర తగ్గడంతో మరింత నష్టపోతున్నారు.

*- వరంగల్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



కమలాపూర్ మండలం గూడూరు కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

# కోతలెక్కువ కొనుడు తక్కువ

## వడ్ల కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యం

- సర్కారు వడ్ల కొనుగోలు లక్ష్యం : 12.25 లక్షల టన్నులు
- ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు : 1,128
- ఇప్పటివరకు ప్రారంభించినవి : 680
- కొనుగోలు చేసిన వడ్లు : 2.38 లక్షల టన్నులు

**రోజుల తరబడి రైతుల పడిగాపులు**

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు 1,128
- ఇప్పటికి మొదలైనవి 680 కొనుగోలు కేంద్రాలే

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కలిపి వానాకాలంలో 9.02 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఆరు జిల్లాల్లో 12.25 లక్షల టన్నుల వడ్లను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నిర్ణీత లక్ష్యంలో ఇప్పటివరకు పావు శాతం కూడా కొనుగోలు చేయలేదు. ఇప్పటికి 2.30 లక్షల టన్నుల వడ్లు కొన్నట్లు అధికారులు చెబుతున్నా వాస్తవంగా ఇంకా తక్కువే ఉన్నట్లు తెలిసింది. హనుమకొండ, జనగామ జిల్లాల్లో వరి కోతలు చివరి దశకు వచ్చాయి. వడ్ల కొనుగోలు కోసం ఆరు జిల్లాల్లో కలిపి 1,128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఇప్పటికి 680 కేంద్రాలే ప్రారంభమయ్యాయి. వీటిలోని ఎక్కువ కేంద్రాల్లో వడ్లను కొనుగోలు చేయడం లేదు. సంచులు లేక కొనుగోలు వాయిదా పడుతున్నాయి. ఇవి ఎప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొన్నది.

**సాకులు చెప్పి**

వానకాలం సీజన్‌లో సాగైన వరిలో 90 శాతం విస్తీర్ణంలో సన్నరకాలే ఉన్నాయి. అధిక వానలు, దోమ, తెగుళ్ల వల్ల పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది. వానకాలం వడ్ల కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించలేదు. వరి కోతలు మొదలైన తర్వాత వడ్ల కొనుగోలు విధానాన్ని ఖరారు చేసింది. సర్కారు నిబంధనలు, మిల్లర్ల షరతులతో కొనుగోళ్లు ఆలస్యమై రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వానకాలం వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వరి కోతలు మొదలైన తర్వాత మాట మార్చింది. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. సన్న వడ్ల రకాలను ఖరారు చేయడంలోనూ ఆలస్యం చేసింది. ప్రభుత్వం ఇవన్నీ చేసేలోపే కోతలు మొదలయ్యాయి. సర్కారు కొనుగోలు కేంద్రాలు లేకపోవడం, బోనస్‌పై సందేహాలతో చాలామంది రైతులు మిల్లర్లకు తక్కువ ధరకు వడ్లను అమ్ముకున్నారు. వరి రైతులకు ఇప్పటికీ ఇవే ఇబ్బందులు కొనసాగుతున్నాయి.



కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# ఆశపడ్డం.. గోసపడుతున్నం..

**ఈ సర్కారు మీద మాకు నమ్మకం లేదు**

- ప్రైవేట్ వ్యాపారులకు వడ్లు అమ్ముకుంటున్నం
- మాజీ మంత్రి ఎర్రబెల్లికి గోడు వెల్లబోసుకున్న మొండ్రాయి రైతులు
- రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం
- నష్టపోయిన రైతులకు కూడా బోనస్ చెల్లించాలని దయాకర్‌రావు డిమాండ్

కొడకండ్ల, నవంబర్ 14 : 'రైతుబంధు బంద్ అయింది.. రుణమాఫీ ఎగ్గొట్టిన్రు.. బోనస్ ఎప్పుడిస్తరో తెల్వదు. అసలు వడ్లే సక్కగ కొంటలేరు.. సర్కారే కొనకుంటే ఇగ మేం ఏం జేయాలె.. దిక్కులేక ప్రైవేట్ల అమ్ముకున్నం. కాంగ్రెసోళ్ల మాయమాటలకు ఆశపడ్డం. నమ్మి మోసపోయినం.. ఇప్పుడు గోసపడుతున్నం' అంటూ పలువురు రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో తమ గోడు వెల్లబోసుకున్నారు. గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి వెళ్తున్న ఎర్రబెల్లిని మార్గమధ్యలో కలిసి వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము పండించిన పంటకు బోనస్ ఇవ్వకపోగా, కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నెల రోజులైనా ధాన్యం కొంటలేరని, బోనస్ కోసం చూస్తే ఉన్న వడ్లు పోయేలా ఉందని చెప్పుకొన్నారు. ఈ సర్కారు బోనస్ ఇస్తదన్న నమ్మకం లేదని, అందుకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో తడిసిన గింజలను కూడా కొనుగోలు చేసి టైముకు డబ్బులు ఇచ్చేదని, మొదట్లనే రైతుబంధు వేస్తే మా జేబులల్ల పైసలు ఉండేవని, కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మితే పది రోజుల్లో డబ్బులు పడేటియని గుర్తుచేశారు. అప్పటి రోజులే మంచిగుండేదని, తాము ఇంకా ఏదో ఆశకు పోయి ఇప్పుడు గోస పడుతున్నామని బాధపడ్డారు. గతంలో ఈ సమయానికి మండలంలోని ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి 50 లారీలకు పైగా వడ్లు మిల్లులకు పోయేవని, ఇప్పుడు ప్రైవేట్‌కు పోతున్నాయని అనుముల అంజయ్య, పెరుమాండ్ల పరశురాములు, నలమాస మల్లయ్యలు తదితర రైతులు ఎర్రబెల్లికి తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని, ప్రతి గింజా కొనేవరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. మద్దతు ధరతో పాటు, బోనస్ ఇవ్వాలని, పూర్తిగా రుణమాఫీ చేయాలని, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుని నష్టపోయిన రైతులకు కూడా బోనస్ చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నం



నాకున్న సొంత పొలంతో మరికొంత కౌలుకు తీసుకుని మొత్తం 8 ఎకరాల్లో వరి పండించిన. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తదనుకున్నం కానీ, కొనకపాయే. వడ్లు ఆరబోసి ఇరవై రోజులైనా మాయిశ్చర్ వస్తలేదు, సరిగా ఎండలేదు అని చెప్తే 100 బస్తాలకు పైగా ప్రైవేట్‌ల అమ్ముకొచ్చినం. ఇంకా 150 బస్తాలకు పైగా ఇయ్యాల ప్రైవేట్‌కు పోతున్నం. బోనస్ వస్తది అంటే సన్న వడ్లు కూడా ఏసినం. అవికూడా ఇప్పుడు ప్రైవేట్‌కు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. మద్దతు ధర దక్కక, బోనస్ లేక ఇబ్బంది పడుతున్నం. రైతుబంధు లేదు.. ఏం లేదు.. అంతా ఉట్టిదే.

**– అనుముల అంజయ్య, రైతు, మొండ్రాయి**



దంతాలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి పోటెత్తిన ధాన్యం

# పది రోజులైనా కాంటాల్లేవ్

## కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు

## సర్కారు తీరుతో నష్టపోతున్న అన్నదాతలు

దంతాలపల్లి, నవంబర్ 14 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆశతో వస్తే పది రోజులు గడిచినా కాంటాలు పెట్టడం లేదు. దీంతో రైతులకు పడిగాపులు తప్పడం లేదు. మండలకేంద్రమైన దంతాలపల్లి సహా పెద్దముప్పారం, కుమ్మరికుంట్ల, వేములపల్లి, రేపోణి, దాట్ల, ఆగపేట, రామానుజాపురంతో పాటు పలు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రభుత్వం సన్నరకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి కేంద్రాల వద్ద ఫ్లెక్సీలను కూడా పెట్టడంతో సంబురపడిన రైతులు.. ఆశతో కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ఆరబెట్టి కంటాల కోసం ఎదురుచుస్తున్నారు. వాతావరణంలో మార్పులు వచ్చి రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు పడుతుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇటు ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోలు చేస్తుందనే నమ్మకం కోల్పోయిన రైతులు పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరలకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రాల వద్ద కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ వెలుగుల్లో వేయిస్తంభాల దేవాలయం

# కార్తీకం.. శుభప్రదం

**నేడు కార్తీక పౌర్ణమి పర్వదినం**

- ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వేలాదిగా దర్శించుకోనున్న భక్తులు



రుద్రేశ్వరస్వామి

కాళేశ్వరం/పాలకుర్తి/హనుమకొండ చౌరస్తా, నవంబర్ 14 : శివ కేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి వరంగ ల్ జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. శివాలయాల్లో ఉదయం 4.30 గంటల నుంచే మహా న్యాస, ఏకాదశ పూర్వక రుద్రాభిషేకాలతో పూజలు ప్రారంభం కానున్నాయి. పూజలు, దానాలు, జపాలు, ఉపవాస దీక్షలు చేసే వారికి పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ప్రత్యేకించి దీపారాధన సర్వశ్రేష్ఠమైనదిగా, దీపదానం చేస్తే సకల పాపాలు తొలగి మోక్షం కలుగుతుందని భావిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున హరుడు త్రిపురాసురుడిని సంహరించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. దీనిని స్మరిస్తూ మహిళలు శుక్రవారం తులసి చెట్టు వద్ద 365 వత్తులను నేతితో తడిపి దీపం వెలిగిస్తారు. ప్రతి ఇంటిలో చిన్నాపెద్దా తేడా లేకుండా తలంటు స్నానం ఆచరించి పూజలు చేయడంతో పాటు ఆలయాలను దర్శించుకుంటారు. శివారాధన చేసే భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేస్తూ ప్రదోషకాలంలో స్వామిని అభిషేకించి మారేడు దళాలతో పూజిస్తారు. హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం, వరంగల్ కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయం, జయశంకర్ భూపాలపల్లిలోని కాళేశ్వర, ముక్తీశ్వర ఆలయం, జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీ సోమేశ్వరస్వామి, కొడవటూరు సిద్దులగుట్ట, ములుగు జిల్లా వెంకటాపురంలోని రామప్ప తదితర ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా, కార్తీక పౌర్ణమి సందర్భంగా గురువారం వరంగల్ నగరంతో పాటు ఆయా పట్టణాల్లోని మార్కెట్లు కిటకిటలాడాయి. ఉసిరి కొమ్మలు, వత్తులు, పూలు, పండ్లు, ప్రమిదలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుతో సందడిగా మారాయి.

**పాలకుర్తిలో అఖండ జ్యోతి**

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, హరి హరులకు నిలయమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం అఖండ జ్యోతిని నిర్వహించనున్నారు. అరుణాచలం, తిరువణ్ణమలై స్ఫూర్తితో ఈ ఆలయంలో అఖండ జ్యోతి వెలుగుతున్నది. పాలకుర్తి ఆలయ గుట్టపై 8 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన భారీ ప్రమిదలో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, 2 క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండ జ్యోతిని ఏటా వెలిగిస్తున్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో సాయంత్రం 5 గంటలకు గిరి ప్రదక్షిణ అనంతరం అఖండ జ్యోతిని వెలిగిస్తారు.



మన ఊరు–మన బడి నిధులతో చిట్యాల మండలం జడలపేటలో నిర్మించిన పాఠశాల భవనం

# పాతవి పక్కకు.. కొత్తవి ముందుకు..

**పాఠశాలల అభివృద్ధి పనుల్లో సర్కారు వివక్ష**

- మన ఊరు-మన బడి నిధుల విడుదలకు బ్రేక్
- అమ్మ ఆదర్శ పాఠశాలలకు మాత్రం లైన్ క్లియర్
- పెండింగ్‌లో రూ. 11.17 కోట్ల బిల్లులు
- ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు
- సమస్యలతో సరస్వతీ పుత్రుల సతమతం
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

సర్కారు పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగింది. 'మన ఊరు - మన బడి' కార్యక్రమాన్ని ప్రారంభించి పనులను కొనసాగించింది. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పరిస్థితి తారుమారైంది. మన ఊరు - మన బడి పనులకు కొత్త సర్కారు మంగళం పాడి, అమ్మ ఆదర్శ పాఠశాల పేరిట స్కూళ్లను ఎంపిక చేసి అభివృద్ధి పనులను మొదలు పెట్టింది. అయితే అప్పటికే పనులు చేసిన పాత కాంట్రాక్టర్లకు మొండిచేయి చూపింది. ఒక్కొక్కరు దాదాపు రూ. 20 లక్షల వరకు అప్పులు చేసి పనులు చేయగా, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పాత పనులను కాదని, కొత్తగా తాము చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలకు బిల్లులు క్లియర్ చేస్తున్నది. పెండింగ్ బిల్లులు చెల్లించడంలో వివక్ష చూపుతున్నది. దీంతో పాత పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వ పక్షపాత వైఖరిపై మండిపడుతున్నారు. కాగా, విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడిచినా పూర్తిస్థాయి సౌకర్యాలు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. అరకొర వసతుల నడుమ విద్యనభ్యసిస్తున్నారు.

*- జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ)*

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కార్యక్రమం కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 149 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఇందులో 50 పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పనులు జరగగా, మిగిలిన వాటిలో 65 శాతం మేర పూర్తయ్యాయి. ఈ పథకం కింద 78 పాఠశాలల్లో 315 గ్రీన్ చాక్ బోర్డులు బిగించారు. అలాగే 52 పాఠశాలకు 1,952 డ్యుయల్ డెస్కులు సరఫరా చేశారు. ఉన్నత పాఠశాలలన్నింటికీ ఇంటరాక్షన్ ప్యానెల్ ప్లాట్‌ఫాం స్క్రీన్‌లను అందించి డిజిటల్ విద్యను బలోపేతం చేశారు. 90 పాఠశాలల్లో పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. కాగా, ఈ పథకం కింద బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 22.62 కోట్లు మంజూరు చేసింది. పనులు కొనసాగిస్తున్న క్రమంలోనే ఎన్నికలు రావడం, బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో పనులు, రూ. 11.17 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పనులను, బిల్లులను పక్కన పెట్టి కొత్తగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పనులను ప్రారంభించింది.

**పెండింగ్‌లోనే పాత బిల్లులు..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'మన ఊరు–మన బడి' కార్యక్రమాన్ని, బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. జిల్లాలో కొత్తగా 265 స్కూళ్లను అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసి రూ. 12.41 కోట్లు (డీఎంఎఫ్‌టీ నిధులు) మంజూ రు చేసింది. పని ప్రారంభంలోనే 25 శాతం నిధులు (రూ. 3.10 కోట్లు) కాంట్రాక్టర్లకు చెల్లించింది. ప్రస్తుతం 220 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తయ్యాయి. పనుల పురోగతిని బట్టి డబ్బులు చెల్లిస్తున్నారు. కాగా, మన ఊరు–మన బడి బిల్లులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్తులు తాకట్టుపెట్టి పనులు చేశామని, చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, తమ బిల్లులు ఇప్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మహదేవపూర్‌లో మన ఊరు–మన బడి నిధులతో నిర్మించిన జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల డైనింగ్ హాలు

# ముగిసిన జోనల్‌స్థాయి స్పోర్ట్స్ మీట్

రాయపర్తి, నవంబర్ 14: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని వరంగల్, హనుమకొండ జిల్లాల డీసీవోలు పోతుల అపర్ణ, దాసరి ఉమామహేశ్వరి అన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘి క సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో తెలంగాణ రాష్ట్ర సోష ల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొ సైటీ సారథ్యంలో నిర్వహించిన 10వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్–2024–25 క్రీడా పోటీలు గురువారం ముగిశా యి. ముఖ్య అతిథులుగా వారు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్–14 వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో టీ అంజలి (నర్సింహులపేట గురుకులం), అండర్–17 విభాగంలో డీ వర్షిణీతేజ, అండర్–19 విభాగంలో లయశ్రీ (రాయపర్తి గురుకులం), అండర్–14 గేమ్స్ చాంపియన్‌షిప్‌లో హసన్‌పర్తి గురుకులం, అండర్–17 విభాగంలో మడికొండ గురుకులం, అండర్–19 విభాగంలో పరకాల గురుకులం, అండర్–14 గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో నర్సింహులపేట గురుకులం, అండర్–17, అండర్–19 విభాగాల్లో రాయపర్తి గురుకులాల క్రీడాకారిణులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారిణుల మార్చ్‌ఫాస్ట్, క్రీడా వందనాలు, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుకులాల ప్రిన్సిపాళ్లు సముద్రాల సరిత, రాయరాకుల సమ్మ య్య, పీడీలు కళమ్మ, ప్రభావతి, గురుకులాల సిబ్బంది అలుగు రమ్యసుధ, కల్పన, లీల, జ్యోతి, వేణు, సృజన, కల్పన పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీసీవోలు అపర్ణ, ఉమామహేశ్వరి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

# ఆరు నెలలకే శిశువు జననం

## సీపీఆర్‌తో ప్రాణం పోసిన 108 సిబ్బంది

వేలేరు, నవంబర్ 14 : ఆరు నెలలకే జన్మించిన శిశువుకు 108 సిబ్బంది సీపీఆర్ ద్వారా ప్రాణం పోసిన ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోక్యా తండాలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన భూక్యా అఖిల ఆరు నెలల గర్భవతి. అయితే నెలలు నిండకుండానే నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది అఖిలను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మగ శిశువుకి జన్మనిచ్చింది. కాగా శిశువులో ఎలాంటి చలనం లేకపోవడంతో 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అనంతరం శిశువుని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు, తల్లిని ప్రసూతి ఆస్పత్రికి తరలించారు. కాగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి బాధిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



శిశువుతో 108 సిబ్బంది